(మొదటి పేజీ తరువాయి..)

## స్థానిక సంస్థల్లో నిజమైన
# కార్యకర్తలను గుర్తిస్తాం

పాయల్ శంకర్ అన్నారు.



ఆదివారం రోజున తలమడుగు మండలంలోని ఉమ్డం అయుషా గార్డెన్లో బోథ్ నియోజక వర్గ స్థాయి బిజెపి కార్యకర్తలు సమావేశంలో ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్ గారితో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో గడిచిన 30 సంవత్సరాలుగా తనకున్న సుదీర్ఘ రాజకీయ అనుభవం తో ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరి గురించి కార్యకర్తల గురించి తనకు అన్ని విషయాలు తెలుసు అని ఎవరు పార్టీకి అనుకూలం, ప్రతికూలం గా వ్యవహరించిన విషయమై నాకు అన్ని విషయాలు సమాచారం ఉంటుందని దాని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అండగా ఉంటామని అన్నారు, ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మాజీ జడ్పీటీసీ తాటి పెల్లి రాజు, బోత్ నియోజకవర్గంలోని బోత్ నేరేడిగొండ సోనాల బజార్హత్నూర్ ఇచ్చోడ గుడిహత్నూర్, తాంసి తలమడుగు, భీంపూర్ తదితర మండలాల మండల అధ్యక్షులు జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అమెరికా భీకర దాడులు...
## ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోదీ

ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పంచుకున్నారు. “ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ పెజెష్కియాన్‌తో మాట్లాడాను. ప్రస్తుత పరిస్థితిపై మేమిద్దరం వివరంగా చర్చించుకున్నాం. ఇటీవల పెరిగిన ఉద్రిక్తతల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాను. తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించాలని, చర్చలు, దౌత్యం ద్వారా ముందుకు సాగాలని తెలిపాను. ప్రస్తుత పరిస్థితుల్లో అదే మెరుగైన మార్గమని తెలిపారు. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వం త్వరగా పునరుద్ధరించాలని స్పష్టం చేశాను” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా, అనూహ్య రీతిలో అమెరికా ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై బాంబు దాడులు చేయడం గమనార్హం. ఈ దాడులు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రతిస్పందనలకు దారితీశాయి. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లలోని తమ అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇది “క్రూరమైన సైనిక దాడి” అని, అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్థూలంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించింది. ఈ దాడుల నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్యసమితిని, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)ను ఇరాన్ కోరింది.

## కేసీఆర్, కేటీఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్ జరిగింది




సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్, ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఘాటుగా స్పందించారు. “గత ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, పలువురు పారిశ్రామికవేత్తల ఫోన్లను విచక్షణారహితంగా ట్యాప్ చేసిన పాపం బీఆర్ఎస్‌దే. కేవలం ప్రతిపక్షాలనే కాకుండా, సొంత పార్టీ నేతలను కూడా వారు వదల్లేదు. ఈ అక్రమ దందా అంతా కేసీఆర్, కేటీఆర్ ఆదేశాలు, వారి ప్రమేయంతోనే జరిగిందని మేము బలంగా విశ్వసిస్తున్నాం” అని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు గురైన బాధితుల పేర్లను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తక్షణమే బయటపెట్టాలని ఆయన స్పష్టం చేశారు. “ఈ వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది” అని గౌడ్ స్పష్టం చేశారు.

## ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వం సమావేశం...



ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తమ తొలి ఏడాది పాలనపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రేపు (జూన్ 23) అమరావతిలో కీలక సమావేశం జరగనుంది. పాలనాపరమైన అంశాలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. 26 జిల్లాల నుంచి హాజరయ్యే అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు అందరితో కలిసి అక్కడే ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు. వాస్తవానికి, కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న జూన్ 12వ తేదీనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఇప్పుడు, రేపటి సమావేశంలో గత ఏడాది కాలంలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించుకోనుంది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధిపతులు (హెచ్‌ఓడీలు), ప్రభుత్వ కార్యదర్శులు, మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారు. తొలి ఏడాది సాధించిన ప్రగతిని వివరిస్తూ, రెండో ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. రాబోయే నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై కూలంకషంగా చర్చించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన ఆర్థిక, పాలనాపరమైన సవాళ్లను అధిగమించి, రాష్ట్రాన్ని పునర్నిర్మాణ పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్వల్పకాలిక అభివృద్ధి లక్ష్యాలతో పాటు, ‘వికసిత ఆంధ్రప్రదేశ్’ సాధన కోసం ‘స్వర్ణాంధ్ర ఏ2047’ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలను కూడా ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడం, 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

## కాళేశ్వరంపై మోదీ చెప్పిందే బీజేపీ విధానం

కుటుంబానికి ఏటీఎంగా మారిందని చెబుతారా? చెప్పరు కదా. మీరే ఆలోచించండి. అంతెందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా ఫోన్ ట్యాపింగ్ జరిగింది. ఇప్పుడు నేను కేంద్ర మంత్రిని. అయినా నా స్టాండ్ మారుతుందా? బీజేపీ స్టాండే నా స్టాండ్. కాళేశ్వరంపై బీజేపీ స్టాండ్ కు భిన్నంగా మా పార్టీ నాయకులు ఎవరూ మాట్లాడినా తప్పే. వాళ్ల విషయం హైకమాండ్ చూసుకుంటది.
కాళేశ్వరం ముమ్మాటికీ పూర్తిగా అవినీతిమయమైన ప్రాజెక్టు. 38 వేల కోట్ల ప్రాజెక్టును 1.2 లక్షల కోట్ల అంచనాలు పెంచి కేసీఆర్ దోచుకున్నది ముమ్మాటికీ నిజం. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులే వందల కోట్లు సంపాదించారంటే, ఇగ కేసీఆర్ కుటుంబం ఏ స్థాయిలో అవినీతికి పాల్పడిందో అర్థం చేసుకోవచ్చు.
కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబాన్ని వదిలేసి కొందరు అధికారులనే బలి చేయాలనుకోవడం దుర్మార్గం.
నేనడుగుతున్నా కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని ఆధారాలున్నా ఇంకా ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. గత ఎన్నికల్లో కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని రాహుల్ గాంధీ చెప్పారు కదా? కాంగ్రెస్సే ఇప్పుడు అధికారంలో ఉంది కదా? మరి సీబీఐ విచారణ ఎందుకు జరపడం లేదు? సమాధానం చెప్పాలి. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విచారణపై మాకు నమ్మకం లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలన్నదే మా ప్రధాన డిమాండ్. నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కానేకాదు. సంయుక్తంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. ఈ రెండు పార్టీలు నాణేనికి బొమ్మాబొరుసులాంటివి. కేసీఆర్ కు రేవంత్ రెడ్డి రక్షణ కవచంగా మారారు. అందుకే కేసీఆర్ పై ఎన్ని అవినీతి ఆరోపణలున్నా, కేసులు పెట్టినా ఆయనను మాత్రం అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారు. ప్రజలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు అర్థమైనయ్. అందుకే ‘అందరికీ ఇచ్చాం అవకాశం...ఇక బీజేపీకి ఇద్దాం అధికారం’ అనే నిర్ణయానికి వచ్చారు.
తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేనందునే డిజైన్ ను మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామని చెప్పడం పచ్చి అబద్ధం. తుమ్మిడిహట్టి దగ్గర 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని సాక్షాత్తు సీడబ్ల్యూసీయే రిపోర్ట్ ఇచ్చింది. గత 33 ఏళ్ల కాలాన్ని(1986 నుండి 2013 వరకు) పరిగణలోకి సైంటిఫిక్ గా లెక్కకట్టి మరీ చెప్పింది కదా?... నా దగ్గర రిపోర్ట్ కాపీ ఉంది. కావాలంటే వాళ్లకు పంపుతా. చదువుకోమనండి. తుమ్మడి హట్టి దగ్గర ప్రాజెక్టు కడితే 38 వేల కోట్లతోనే పూర్తయతది. కానీ కేసీఆర్ కుటుంబానికి కమీషన్లు రావు. అందుకే కాళేశ్వరం పేరుతో డిజైన్ ను మార్చి 38 వేల కోట్ల ప్రాజెక్టును 1 లక్షా 20 వేల కోట్లకు పెంచి ఏటీఎంలా వాడుకున్నరు.
నేషనల్ సేఫ్టీ అథారిటీ డ్యాం(ఎన్డీఎస్ఏ) అంటే ఏమనుకుంటున్నరు. కేసీఆర్ లెక్క తాగి ఏది పడితే అది రాసే సంస్థ కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం... పార్లమెంట్ ఆమోదించి ఏర్పాటు చేసిన అథారిటీ ఇది. ఎన్డీఎస్ స్వతంత్ర్యపైనే బురద చల్లుతారా కేసీఆర్ కుటుంబం తమ కంటే తోపు ఎవరూ లేరన్నట్లు మాట్లాడుతున్నరు. ఇగ కేసీఆర్ అయితే తనకు తానే పెద్ద ఇంజనీర్...పెద్ద డాక్టర్ అని పదేపదే చెప్పుకున్నడు కదా. కరోనా వస్తే పారాసిటమాల్ వేసుకుంటే చాలని చెప్పిండు కదా. తుపాకీ రాముడి టోపీ పెట్టుకుని చేతిలో కట్టె పట్టుకుని పెద్ద ఇంజనీర్ లెక్క ఫోజులు కొట్టిండు కదా? అసలు కేసీఆర్ పాలనలో మంత్రులకు విలువందా?. కేసీఆర్ కు తలూపడంతప్ప మంత్రులు ఏనాడైనా ఆయనవద్ద మాట్లాడే సాహసం కూడా చేశారా? కాళేశ్వరంసహా అన్ని నిర్ణయాలు కేసీఆర్ ఒక్కడే సొంతంగా తీసుకున్నాడన్నది నిజం. ఆ మాట కేసీఆరే చాలా సార్లు చెప్పిండు కదా. నదులకు నడక నేర్పింది కేసీఆరేనని ఆ కుటుంబమంతా మాట్లాడింది కదా? ఇయాళ ఎందుకు మాట మారుస్తున్నారు? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయం నాది కాదని ఎందుకు తోకముడుస్తున్నారు?
కేబినెట్ ఆమోదం, సబ్ కమిటీ సిఫారుసులతో కాళేశ్వరం కట్టారని బీఆర్ఎస్ చెబుతుంటే... ఆ ఆధారాలు ఎందుకు బయటపెట్టడం లేదు?. తుమ్మల నాగేశ్వరరావు ఇప్పుడు కూడా మంత్రిగా ఉన్నారు కదా? వాస్తవాలు ఆధారాలతోసహా ప్రజల ముందుంచాలని కోరుతున్నా. కాళేశ్వరం వల్ల వచ్చిన లాభమేంది? రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకోవడం తప్ప సాధించిందేముంది? కాళేశ్వరంవల్ల భూగర్భజలాలు పెరిగాయి. పంట దిగుబడి పెరిగింది. కాల్వలు నిండాయని చెప్పడం పచ్చి అబద్ధం. కాళేశ్వరంలో నీళ్లు లేకపోయినా ఈ సీజన్ లో రికార్డు స్థాయిలో పంట దిగుబడి వచ్చింది కదా? మరి దీనికేం సమాధానం చెబుతారు. వానలు పడి కాలువలు, చెరువులు నిండితే కాళేశ్వరంవల్లే అవన్ని నిండినట్లు ఫోజులు కొట్టిన దుర్మార్గులు బీఆర్ఎస్ నేతలు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ముందుకు సాగాలన్నదే బీజేపీ అభిమతం. కేసీఆర్ కు నోటీసులు ఒట్టి డ్రామా.... అందుకే ఎన్ని కేసులున్నా అరెస్ట్ చేయడం లేదు. మాకు అధికారం ఉంటే ఈపాటికే కేసీఆర్ ను, అవినీతిపరులను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లం. రాష్ట్ర ప్రభుత్వంతో పనిలేకుండా కేంద్రమే నేరుగా సీబీఐతో విచారణ చేయించే అవకాశముంటే... కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఈపాటికే వాళ్లను బొక్కలో వేసేవాళ్లం. బీజేపీ కుటుంబ పార్టీలకు ముమ్మాటికీ వ్యతిరేకం. బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంటామని ఎందుకు అనుకుంటున్నారు? బీఆర్ఎస్ లాంటి అవినీతి, కుటుంబ పార్టీని దరిదాపుల్లోకి కూడా రానీయం.
కరీంనగర్ లో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందే. ముఖ్యంగా జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన ఫైలు విషయంపై కలెక్టర్ తో మాట్లాడిన. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కమార్ రెడ్డితోనూ మాట్లాడి తప్పకుండా స్థలాలిచ్చేలా క్రుషి చేస్తా. అట్లాగే మిగిలిన అర్హులైన జర్నలిస్టులందరికీ కూడా స్థలాలు ఇప్పించేందుకు యత్నిస్తా. బీజేపీ అధికారంలోకి వస్తే తప్పకుండా స్థలాలిచ్చే బాధ్యత తీసుకుంటా.

# చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

- **ఆదరణ ఫౌండేషన్ రాందేవ్ ఆసుపత్రి సంయుక్తంగా వైద్య శిబిరం...**
- **విశేష ఆదరణతో హర్షం వ్యక్తం చేసిన చిన్నారుల తల్లిదండ్రులు...**



**కూకట్ పల్లి జూన్ 22 వెలుతురు:**
సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆస్పత్రి ముందుంటుందని రాందేవ్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు అన్నారు. ఆదివారం ఆదరణ ఫౌండేషన్ (స్వచ్ఛంద సంస్థ) సహకారంతో రాందేవ్ ఆసుపత్రిలో సంవత్సరం నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని రాందేవ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్ లో ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, ఇతర వ్యాధులను గుర్తించడానికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ యోబు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే పిల్లలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండడానికి వైద్య శిబిరంలో పలు పరీక్షలు నిర్వహించి పిల్లలకు రోగాల పట్ల అప్రమత్తత ఉండడానికి డాక్టర్లచే పలు సూచనలు చేయించడం జరిగిందన్నారు. పిల్లల వైద్య శిబిరానికి ఆదరణ ఫౌండేషన్ సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అరగెల రఘునాథ్ బాబు మాట్లాడుతూ రాందేవ్ ఆస్పత్రి వైద్యరంగంలో అందిస్తున్న సేవలు అద్భుతం అని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో రాందేవ్ హాస్పటల్ డాక్టర్ లు మణికుమార్, దయాకర్, మణి, ప్రశాంతి, ప్రిన్సి, కల్పన మంతెన, లీలా సృజన లు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ కోశాధికారి భాను వర కుమార్, ప్రధాన కార్యదర్శి పి మేరీ జోన్స్, ఎ. అనిషా, ఎ. సన్నీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్ పై చేసిన దాడులపై ప్రజలందరూ గర్వించారు..

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



**కూకట్ పల్లి జూన్ 22 వెలుతురు:**
సిందూర్ మెరుపు దాడులతో పాకిస్తాన్ ను తోకముడిచేలా చేసిన ఘనత మన సైనిక దళాలదేనని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడలో భారత వాయుసేనలో ఆపరేషన్ సిందూర్ లో పాల్గొని తిరిగి తన స్వగృహానికి చేరుకున్న సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్ సైనికుడుగా క్రియాశీలక పాత్ర పోషినందుకు అభినందిస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్, వారి కుటుంబ సభ్యులను అభినదించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాపోలు శ్రీనివాస్ భాగ్య దంపతుల ప్రథమ పుత్రుడు సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్ సైన్యంలో పని చేస్తూ భారత వాయుసేనలో ఆపరేషన్ సిందూర్ లో భాగంగా సార్జెంట్ రాపోలు సుఖదేవ్ శరణ్ ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొని 140 కోట్ల భారతీయుల కోసం చేసిన పోరాటంలో తన ధైర్య సాహసాలను మరవలేమని అన్నారు. ఉగ్రవాదులను ప్రేరిపిస్తున్న పాకిస్తాన్ కు బుద్ధి చెప్పేందుకు భారత్ సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరుతో ఆ దేశం పై చేసిన దాడులపై దేశ ప్రజలందరూ గర్వించారు అని అన్నారు. భారత సైనికులు తమ ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని, సిందూర్ సైన్యానికి సెల్యూట్ అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్పా రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివ కుమార్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, రవి గౌడ్, మధుమోహన్, హేమంత్, మధుమోహన్, జిల్లా శివ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్ గజానంద్, సోను, సత్తి గౌడ్, ప్రశాంత్, శ్రీనివాస్, ఆర్ఎం సురేష్, మనోజ్, రవి ముదిరాజ్, అనిల్, సత్య పాల్, తుకారం, రవి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కాలనీ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో, జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వాలి.

### సర్క్యులర్ జారీ చేసిన మంచిర్యాల విద్యాశాఖ అధికారి, ఎస్, యాదయ్య.


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, MANCHERIAL.
Present: Sri.S. Yadaiah, M.A., B.Ed.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 22**
మంచిర్యాల జిల్లా టియుడబ్ల్యూజే, అధ్యక్ష, కార్యదర్శులు, డేగ సత్యం, పింగిలి సంపత్ రెడ్డి, లు, జిల్లా విద్యాశాఖ అధికారికి చేసిన విజ్ఞప్తి మేరకు, మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో, వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వాలని, మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్, యాదయ్య, శుక్రవారం, అన్ని మండలాల ఎంఈఓ లకు, సర్క్యులర్ ను జారీ చేశారు. విజ్ఞప్తి చేసిన వెంటనే డిఇఓ స్పందించి, ఫీజుల రాయితీ విషయమై సర్క్యులర్ జారీ చేసినందుకు, మంచిర్యాల జిల్లా టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు డేగ సత్యం, పింగిలి సంపత్ రెడ్డిలు, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ పరంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తూ ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వడానికి కృషిచేసిన టియుడబ్ల్యూజే నాయకత్వానికి, మంచిర్యాల జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు, వారికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

## కరీంనగర్ చింతకుంట చౌరస్తా లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ వెలుతురు జూన్ 22:**
చింతకుంట చౌరస్తా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ ఈజేఎస్ కింద 40 లక్షల ఈత, 5 లక్షళ తాటి మొక్కలు నాటుతున్నాం. మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. గౌడ సంఘ నేతలు ప్రభుత్వ స్థలాలు గుర్తించి అధికారుల దృష్టికి తేవాలి. మీరు ఆ స్థలాల్లో మొక్కలు నాటాలి. కల్లు కల్తీలేకుండా ఉంటే ఔషదం లాంటిదే. కల్లు కాంపౌండ్లకు నిధులిస్తాం. చింతకుంటలో కల్లు కాంపౌండ్ నిర్మించుకుంటే 5లక్షలు కేటాయిస్తాం. సర్వాయి పాపన్న స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలి.

# శాతవాహన నూతన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన




వ్యయంతో కొత్త అకడమిక్ భవనం, రూ.2.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రహారీగోడను నిర్మించనున్నారు. అకడమిక్ భవన్ నిర్మాణానికయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషశ్రీ పథకం నుండి నిధులను మంజూరు చేసింది. శాతవాహన వర్శిటీ అంతర్గత నిధులతో ప్రహరీ గోడను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ అధికారులతో కలిసి ఆ ప్రాంగణమంతా కలియ తిరిగారు. విద్యార్థులతో ముచ్చటిస్తారు. యూనివర్శిటీ అభివృద్ధి, నిధుల కేటాయింపు విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చూపుతున్న చొరవ మరువలేనిదని వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ అన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల పక్షాన సంజయ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె. రవికుమార్ తోపాటు విశ్వవిద్యాలయ క్యాంపస్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.ం

## రాందేవ్ రావ్ హాస్పిటల్ లో చిరుమర్తి సోమయ్య ను పరామర్శించిన సామ రామ్మోహన్ రెడ్డి....

**కూకట్ పల్లి జూన్ 22 వెలుతురు:**
గత కొంత కాలంగా కూకట్ పల్లి రాందేవ్ రావు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు తండ్రి చిరుమర్తి సోమయ్య ను ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్, టిపిసిసి స్పోక్ పర్సన్ సామ రాంమోహన్ రెడ్డి పరామర్శించారు. సోమయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని రామ్మోహన్ రెడ్డి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సోమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.



## పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయండి

- ముఖ్యమంత్రి గారికి బహిరంగ లేఖ రాసిన బీసీ నేత లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:** గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలన్నిటిని విడుదల చేయాలని కోరుతూ ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోర్సు పూర్తయిన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాల కోసం కళాశాలలకు వెళితే పూర్తి ఫీజులు చెల్లిస్తేనే ఒరిజినల్ ధృవపత్రాలు ఇస్తామని చెబుతున్నాయన్నారు.రెండు వేల కోట్లకు టోకెన్లు ఇచ్చి మరీ నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఫీజు రియంబర్స్మెంట్ మొత్తాన్ని చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని లింగంగౌడ్ కోరారు.

## చిన్నారి మహంతికి సమ్మి గౌడ్ చిలువేరు ఆశీర్వాదం పట్టు వస్త్రాల బహూకరణ



**కేసముద్రం వెలుతురు జూన్ 22:** కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కంది మమత- సతీష్ దంపతుల కుమార్తె మహంతి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి నూతన పట్టు వస్త్రాలు బహూకరించి చిన్నారులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సంతోషంతో చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారికి మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ చిన్నారులను ఆశీర్వదించారు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్. ఈ కార్యక్రమంలో చాగంటి రాములు,పెద్ది విజేందర్,మునికుంట్ల కన్నయ్య,కంకల బీరయ్య, ప్రవీణ్ కుమార్,వచ్చాల సాంబయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నేత తోట సాగర్



**కరీంనగర్ వెలుతురు జూన్ 22:** కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రఫుల్ దేశాయి ని బీజేపీ నాయకులు, ఏడవ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో నెలకొన్న దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించాలని కమీషనర్ ను కోరారు. ఈ మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని తోట సాగర్ పేర్కొన్నారు.

## రామాయపల్లి గ్రామంలో మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రచ్చ బండ కార్యక్రమం నిర్వహించిన మనోహరాబాద్ బిజెపి మండల నాయకులు



**మనోహరాబాద్ వెలుతురు జూన్ 22:** మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారు మరియు జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ గారి ఆదేశానుసారం నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11సంవత్సరాల పాలన లోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మనోహరాబాద్ మండల బిజెపి అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ అన్నారు ఆదివారం రోజున మండలం లోని రామాయపల్లి గ్రామం లో సీనియర్ నాయకులు కొల్తూరి నరేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు రితేష్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో మోదీ 11 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రచ్చ బండ కార్యక్రమం లో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధుల తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, సిసి. రోడ్ల తో పాటు ప్రకృతి వనాలు, స్మశాన వాటికల నిర్మాణం, ఉపాధి హామీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. రేషన్ బియ్యం ఒక్కొక్కరికి 5కిలోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో కేంద్రం వాటా ఉందన్నారు. కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేంద్ర చారి, సీనియర్ నాయకులు పురం మహేష్ ముదిరాజ్, కుంట మహేష్, మామిండ్ల ప్రణయ్, చాపల విజయ్,మండల ప్రధాన కార్యదర్శిలు వెంకటోళ్ల సాయి కిరణ్ గౌడ్, కరాటే మల్లేష్ ముదిరాజ్, మండల ఉపాధ్యక్షులు చాకలి మల్లేష్,ఎం. కిరణ్ ముదిరాజ్, సిహెచ్. రాజేష్ గౌడ్, కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్,కాళ్లకల్ గ్రామ అధ్యక్షులు కొత్తూరు మల్లేష్ ముదిరాజ్,మండల నాయకులు ఎర్ర కృష్ణ, సున్నం అశోక్ ముదిరాజ్, రచ్చ శ్రీకాంత్, మంచి గిరీష్, ఊట్ల నాగరాజు, కొత్తూరి మహేష్,నేతికుంట గణేష్, శివ, అరవింద్, రచ్చ కిరణ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## బండ్లగూడ గ్రామంలో కాంగ్రెస్ నూతన కార్యవర్గ ఏర్పాటును అభినందించిన కాట శ్రీనివాస్ గౌడ్



**బండ్లగూడ వెలుతురు జూన్ 22:** పటాన్చెరు నియోజకవర్గంలోని బండ్లగూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని మాజీ సర్పంచ్ ముత్యాల జయమ్మ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వడ్డె గోపాల్ గారిని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకోగా, ఇతర గ్రామ నాయకులను కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారిని నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు చేపట్టిన వారిని కాట శ్రీనివాస్ గౌడ్ గారు సన్మానించి, వారికి అభినందనలు తెలిపారు.

# విశ్వ మానవ విధ్వంసానికి పాల్పడుతున్న అమెరికా

అమెరికా యుద్ధోన్మాదాన్ని బిజెపి మతోన్మాదాన్ని వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రామన్నపేట లో సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 22** అమెరికా యుద్దోన్మాదపు కాంక్షతో ప్రపంచ దేశాలను అల్లా కల్లోలం చేసేందుకు ప్రయత్నిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ తెలిపారు. స్థానిక జెపి ఫంక్షన్ హాల్ లో సిపిఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జల్లెల పెంటయ్య అధ్యక్షతన మొదటి రోజు ప్రారంభం కావడం జరిగింది. ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు పద్ధతి లింగయ్య ఆవిష్కరించగా,అనంతరం అమరవీరులకు జోహార్లు అర్పించారు.రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రారంభ ఉపన్యాసం చేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహాంగీర్ మాట్లాడుతూ అగ్రరాజ్యం అమెరికా ప్రపంచంలో ఆయుధ సంపత్తితో ఆధిపత్యం చేస్తూ ఇజ్రాయిల్ వంటి దేశాలతో విశ్వ మానవ విధ్వంసానికి పాల్పడుతుందన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక విచక్షణ లేకుండా మాట్లాడుతూ అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తున్నాడు. తన ఆంక్షలు ధిక్కరిస్తూ నిలబడుతున్న ఇరాన్, పాలస్తీనాపై అమెరికా అండతో ఇజ్రాయిల్ ప్రభుత్వం సామాన్యులపై బాంబుల వర్షం కురిపిస్తుంది. భారత్ - పాకిస్తాన్ మధ్య జరిగే యుద్ధాన్ని సంబంధంలేని ట్రంప్ మాట్లాడి యుద్ధం నేనే ఆపానని చెప్పి మరోవైపు ఇతర దేశాలపై పైశాచికంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. అమెరికా యుద్దోన్మాదాన్ని,సామ్రాజ్యవాద కాంక్షను భారత దేశ ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు ఖండించాలని అన్నారు. సిపిఎం కార్యకర్తలు ప్రస్తుత రాజకీయ పరిణామాలను అర్థం చేసుకొని గ్రామీణ స్థాయి ప్రజలకు వివరించాలని అన్నారు. మనుషుల మధ్య మత వైషమ్యాలు పెంచుతున్న బిజెపి మనుషుల మధ్య మత వైశ్యమ్యాలు సృష్టించి విచ్ఛిన్నకర పాలన కొనసాగిస్తున్న బిజెపి విధానాలను సంఘటితంగా ఎదుర్కోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ అన్నారు. మతం- మతోన్మాదం అంశంపై మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం మతం పేరుతో పరిపాలన కొనసాగిస్తూ భారత రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువల్ని దెబ్బతీస్తుంది అన్నారు. బిజెపి మత ఉన్మాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి,బోయిని ఆనంద్, కందుల హనుమంతు,కల్లూరి నగేష్, జంపాల అండాలు,మండల కమిటీ సభ్యులు గన్నెబోయిన విజయభాస్కర్, గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్,వేముల సైదులు, బొడిగె రజిత, అవనగంటి నగేష్, గాదె నరేందర్,పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గంటెపాక శివకుమార్, శాఖా కార్యదర్శులు పులిబిక్షం, తాళ్లపల్లి జితేందర్,కునూరు మల్లేశం, శానగొండ వెంకటేశ్వర్లు, గంగాదేవి మల్లేశం, గన్నబోయిన శ్రీనివాస్, నాగటి అంజయ్య, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానగొండ రాము, మెట్టు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- ప్రభుత్వ పదవులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- బంగ్లా క్రీడలో బలవుతున్న బీసీలు
- వచ్చే ఎన్నికల్లో గద్వాల కోటపై బీసీ జెండా ఎగరేస్తాం
- బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**జోగులాంబ గద్వాల జిల్లా వెలుతురు జూన్ 22:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, లేనిపక్షంలో బీసీల కోసం ఆమరణ నిరహార దీక్ష చేపడతానని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో బీసీ పొలిటికల్ జెఏసి జోగులాంబ గద్వాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి రాచాల యుగంధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందకపోయినా పార్టీ తరఫున టికెట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఆచరణలో సాధ్యం కాదన్నారు. కేవలం ఒక అధికార పార్టీ మాత్రమే టికెట్లు ఇస్తే సరిపోదని, అలా చేస్తే ప్రతిపక్ష పార్టీలలో బలమైన నాయకుడు బరిలో ఉంటే బలయ్యేది బీసీ సామాజిక వర్గం నాయకులే అని అన్నారు. బీసీలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఆర్డినెన్స్ తెచ్చి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో పార్టీ పదవుల్లో బీసీలకు అధికంగా ప్రాధాన్యం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వ, నామినేటెడ్ పదవుల్లో మాత్రం బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, కష్టపడేది ఎస్సీ, ఎస్టీ, బీసీలు... పదవులు అనుభవించేది మాత్రం అగ్రవర్ణాలా? అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నియమించే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. గద్వాలలో బంగ్లా, బండ్ల కుటుంబాలు ఆడే రాజకీయ క్రీడలో బీసీలు బలైపోతున్నారని, పైకి శత్రువులుగా నటిస్తూ... లోలోపల మాత్రం ఒక్కటేనన్న విషయం గత అసెంబ్లీ ఎన్నికల్లో రుజువైందని, వారిరువురూ ఏకమై బీసీ అభ్యర్థిని ఓడించిన విషయం బీసీలు మర్చిపోలేదన్నారు. బీసీల రాజ్యాధికారం సాధించాలంటే స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలు కీలకమని, అన్ని జనరల్ స్థానాల్లో బీసీలు పోటీచేసి గెలుపొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో గద్వాల కోటపై బీసీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి గద్వాల జిల్లా అధ్యక్షుడు నరసింహా యాదవ్, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, ఎర్రవల్లి మండల అధ్యక్షుడు ఈదన్న నాయుడు, ఉండవల్లి మండల అధ్యక్షుడు ఎల్లగౌడ్, నాయకులు పాండురంగ యాదవ్, వివి గౌడ్, గూడుషా, దేవర శివ, అంజన్న యాదవ్, బత్తుల జితేందర్, ధర్మేంద్ర సాగర్, నరసింహ యాదవ్, అస్కని రమేష్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి 25 కోట్లు కేటాయించాలి.

ఉద్యమకారుల డిమాండ్



కామ్రేడ్ రెబ్బాస్ రాములు..
సిపిఐ( తెలంగాణ ఉద్యమకారులు)

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఏర్పడి 70 సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది.ఈ ఆరోగ్య కేంద్రానికి 11 మండలాల గ్రామ ప్రజలు ఆరోగ్యరీత్యా వస్తూ ఉంటారు.నిత్యం ఔట్ పేషంట్స్ 500 మంది, గర్భిణీ స్త్రీలు 200 మందితో కలిపి సుమారు 700 లకు పైగా నిత్యం ఆరోగ్య కేంద్రానికి రావడం జరుగుతుంది.అలాంటి చరిత్ర కలిగిన హాస్పిటల్ ను సందర్శించిన,ఉద్యమకారులు కామ్రేడ్ రెబ్బాస్ రాములు విలేకరులతో మాట్లాడుతూ ఈ హాస్పిటల్ ను 100 పడకల ఆసుపత్రిగా 2006 సంవత్సరంలో కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రకటించారని, అప్పటినుండి ఇప్పటివరకు గేటు వద్ద ఏరియా హాస్పిటల్ గా కనిపిస్తూ,రికార్డులలో మాత్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా కొనసాగుతుందని, 100 పడకల హాస్పిటల్ కావాలని అనేక పోరాటాలు చేసినా కానీ గత ప్రభుత్వము, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మధ్యకాలంలో సుమారు 10 నెలల క్రితం అనేక పార్టీల వారు పోరాటాలు చేసి ఆరోగ్య శాఖామాత్యులకు స్థానిక ఎమ్మెల్యే ద్వారా సమాచారం అందజేసిన నిమ్మకు నీరెత్తినట్లుగా కనిపిస్తుందని, నకిరేకల్, చౌటుప్పల్ మండలాలలో 30 పడకల హాస్పిటల్ కు 20 సంవత్సరాల చరిత్ర లేదు కానీ, వంద పడక హాస్పిటల్ గా ప్రకటన చేసి బడ్జెట్ విడుదల చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి . ఇంత చరిత్ర కలిగిన రామన్నపేట ఆరోగ్య కేంద్రం,వెనకబడిపోతుంది.మొన్న శుక్రవారం రోజున ఉద్యమకారులు, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి స్థానిక సమస్యలను అందుబాటులో ఉన్న డాక్టర్లతో మాట్లాడామని, హాస్పిటల్ సిబ్బంది 22 మందికి గాను నలుగురు మాత్రమే పని చేస్తున్నారని, రామన్నపేట హాస్పిటల్ ఆవరణంలో ఉన్న చెట్ల ద్వారా వాటి వేర్లు పాత భవనం గోడలను ఛేదించి మరుగుదొడ్ల లోకి ప్రవేశించి డాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితులతో కూడుకున్న సమస్య ఏర్పడింది.అందుకు కేంద్ర ప్రభుత్వం 5 కోట్ల 76 లక్షలు మంజూరు చేశామని ఒప్పుకున్న, రాష్ట్ర ప్రభుత్వం దానికి మిగతా ఖర్చులు పెట్టుకోమని కేంద్ర ప్రభుత్వం అడగగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లేదని చెబుతుందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 25 కోట్లు నిధుల మంజూరు చేసి వంద పడకల హాస్పిటల్ గా ప్రకటించాలని తెలంగాణ ఉద్యమకారులుగా కోరుతున్నాము. అంతేకాకుండా రామన్నపేట ఏరియా హాస్పిటల్ కు నిధులు కేటాయించడమే కాకుండా రామన్నపేట మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని, లేని పక్షంలో రెండు మూడు రోజులలో మండలంలోని అన్ని పార్టీల నాయకత్వంతో మరియు అన్ని గ్రామాల మాజీ సర్పంచులతో, ఎంపీటీసీ లతో కలిపి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు,ఉద్యమకారులు ఆధ్వర్యంలో జూలై మొదటి వారంలో పోరాటం సాగిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గంగపురం యాదయ్య, కందుల నరసింహ, పెండెం రవీందర్, నరసింహ చారి, ఇమామ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని అందుకున్న గోద మల్లికార్జున్ గౌడ్




**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:** మన ఆలోచన సాధన సమితి (మాస్) ప్రధాన కార్యాలయం నాగోల్ లో అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారి ఆధ్వర్యంలో మొదటి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం నేత, పూస నరసింహ బెస్త, పాల్గొని రాష్ట్ర కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేయడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్న గోదా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ కీలకమైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలో నన్ను నియమించినందుకు వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు గారికి, మరియు, మాస్ గౌరవ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామాలలో ఉన్న బీసీ కులాల మధ్య సఖ్యత, మరియు, రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం తీసుకురావడమే మాస్ యొక్క ముఖ్య ఉద్దేశం అని, దానికి నా వంతు ప్రయత్నం చేస్తాను అని చెప్పడం జరిగింది.

## నియోటిస్ కార్మికులకు భారీ వేతన ఒప్పందం

- కాట శ్రీనివాస్ గౌడ్

**పాశమైలారం వెలుతురు జూన్ 22:** పటాన్చెరు మండలం పాశమైలారం గ్రామంలోని నియోటిస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సు కోసం, INTUC నియోటిస్ పరిశ్రమ అధ్యక్షుడు కాట శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. చంద్రశేఖర్ గారితో కలిసి పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చల ఫలితంగా గతంలో ?6,750గా ఉన్న కనీస వేతనం ప్రతి కార్మికుడికి ?7,400కి పెంచేలా మెరుగైన వేతన ఒప్పందం కుదిరింది. ఇది కార్మికుల శ్రమకు గౌరవం కల్పించేలా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఉండనుంది. వేతన ఒప్పందం విజయవంతం అయిన నేపథ్యంలో నియోటిస్ పరిశ్రమ యూనియన్ బాడీ సభ్యులు కాట శ్రీనివాస్ గౌడ్ గారి నివాసానికి వెళ్లి, ఆయనను ఘనంగా సన్మానించి, కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ: “కార్మికులు శ్రమిస్తున్న ప్రతి నీటి బొట్టు విలువైనది. వారికి న్యాయం జరిగేలా, గౌరవంగా జీవించేందుకు సాధికారత కలిగేలా INTUC ద్వారా కృషి కొనసాగుతూనే ఉంటుంది. కార్మికుల సమస్యలు ఎప్పుడూ మా సమస్యలే” అని చెప్పారు.

## తాడిచెట్టు పైనుంచి పడిన వ్యక్తికి తీవ్ర గాయాలు

- ప్రభుత్వ నేటికైనా సేఫ్టీ మోగులు అందించాలి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 22** మండలం పల్లివాడ గ్రామానికి చెందిన కంభంపాటి మచ్చగిరి తండ్రి బిక్షమయ్య వయస్సు 34 సంవత్సరాలు రోజు మాదిరిగానే ఈ రోజు కూడా తన వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్ర గాయాలు అయినవి స్థానికులు కుటుంబ సభ్యులు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తప్పించగా తన యొక్క ఎడమ చేతి విరగడంతోపాటు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం పై పెద్ద హాస్పిటల్ కు తరలించడం జరిగినది. ప్రభుత్వం నేటికైనా సేఫ్టీమోగులు అందించాలని వైద్యానికి కావలసిన పూర్తిస్థాయి ఖర్చులు ప్రభుత్వం ఇవ్వాలని స్థానికుల గౌడ సంఘం నాయకులు కోరినారు.

## ఎర్రకుంట మైసమ్మ తల్లికి వనభోజనాలు..



**ఇనుగుర్తి, వెలుతురు జూన్ 22:** మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నాగారంలో గ్రామస్తులు ఎర్రకుంట మైసమ్మ తల్లికి ఆదివారం వనభోజనాలకు తరలి వెళ్లారు. ఏటా ఆరుద్ర కార్తె లో వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో ఆరోగ్యంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ వనభోజనాలకు వెళ్లే సంప్రదాయం గ్రామంలో అనాదిగా ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి మహిళలు గంపలను అలంకరించుకొని వంట సామాగ్రి సర్దుకుని భక్తిశ్రద్ధలతో చెట్ల క్రిందికి వెళ్లారు. బంధుమిత్రులతో కలిసి ఆయా కుటుంబాలు భోజనాలు స్వీకరించారు.దీంతో పలు చెట్లు ప్రజలతో సందడిగా మారాయి.

https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

# అచ్చంపేట ఐసిడిఎస్ క్లస్టర్ లో వసూళ్ళ పర్వం ?

- పోషణ అభియాన్ గత 2023-24 బడ్జెట్లో నిధులు విడుదల
- ప్రతి సెంటర్ నుండి రూ. 15 వందలు వసూళ్లు..?
- అలాంటిదేమీ లేదు నా దృష్టికి రాలేదు సిడిపిఓ లక్ష్మి

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్/అచ్చంపేట జూన్ 22:**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఐసిడిఎస్ లో వసూళ్ల పర్వం కొనసాగుతుంది. స్వయంగా అంగన్వాడి సూపర్వైజర్ లే ఆ వ్యవహారానంత చక్కబెడుతున్నారని ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2018 మార్చి 8న బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం అందించే విషయంలో పైవారిని మరింత చైతన్యవంతం చేస్తూ అంగన్వాడి పౌష్టిక ఆహారాన్ని పై వర్గాల వారు తప్పక ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించే క్రమంలో సమావేశం నిర్వహించేందుకు ప్రతి సెంటర్ కు ప్రతినెల రూ. 5 వందల చొప్పున ఏడాదికి రూ. 12 వేలు, ఆయాకు రూ. 3 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ నేపథ్యంలో 2020 నుండి 22 వరకు కరోనా వ్యాధి వ్యాప్తి వల్ల లాక్ డౌన్ కారణంగా అటు నిధులు విడుదల కాలేదు. తదుపరి 2022-24 వరకు రెండు సంవత్సరాల కు సంబంధించిన మొత్తం నిధులను ఒకేసారి ప్రతి అంగన్వాడీ టీచర్ అకౌంట్లోకి గత మార్చి నెల బడ్జెట్లో విడుదల చేసింది. ఒకేసారి అంగన్వాడీ టీచర్లకు ఒక్కరికి 12 వేల చొప్పున నిధులు విడుదల కావడంతో దానిని జీర్ణించుకోలేని సూపర్వైజర్లు పై అధికారి సుచనతోనే వసూళ్ల పర్వానికి తెర లేపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అచ్చంపేట ఐసిడిఎస్ క్లస్టర్లో అచ్చంపేట అమ్రాబాద్, పదర మండలాలలో కలిపి మొత్తం 195 అంగన్వాడి సెంటర్లు కొనసాగుతున్నాయి. అంగన్వాడీ సెంటర్లలో ఎగ్ బిర్యానీ, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని కూడా టీచర్ల నుండి డబ్బులు వసూలు చేసి కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం.

## వసూళ్లు చేసింది ఎవరు ఎంతెంత..?

ప్రతి టీచర్ నుండి తప్పక డబ్బులు ఇవ్వాల్సి ఉందని చాలా ఖర్చులు ఉంటాయని, మీరు ఏ విధంగా పనిచేస్తున్నారు. అందరికీ తెలిసిందేనని, కావున పై అధికారి సూచనతోనే ప్రతి అంగన్వాడీ టీచర్ నుండి రూ. 12 వందలు, ప్రతి ఆయా నుండి రూ. 300 చొప్పున దాదాపు నాలుగు లక్షల రూపాయలు సూపర్వైజర్ లే వసూలు చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అందుకు సంబంధించి నియోజకవర్గంలో అంగన్వాడీ టీచర్ల గుసగుసలు అక్కడక్కడ వినిపిస్తూ అంతర్గతంగా జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో తిరిగి ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రతి అంగన్వాడి సెంటర్లలో ఎగ్ బిర్యానీ, అక్షరాభ్యాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో అచ్చంపేట పట్టణంలో అధికారికంగా ఏర్పాటు చేసిన ఎగ్ బిర్యానీ, అక్షరాస్యత కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్వయంగా పాల్గొని ప్రారంభించిన సందర్భంగా ప్రతి టీచర్ నుండి రూ. 500 చొప్పున వసూలు చేసి ఆ కార్యక్రమానికి విజయవంతం చేసినట్లు సమాచారం. మొత్తంగా సూపర్వైజర్లు అంగన్వాడి సెంటర్లలో పర్యవేక్షణ అంతంత మాత్రమే ఉండేందుకు ఆయా సందర్భాలలో అంగన్వాడీ టీచర్లు కొంత మొక్కులు చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొనడం దారుణమైన విషయమని చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో కొందరు అంగన్వాడీ టీచర్లు అందుకు డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించినందుకే పనికట్టుకొని ఆయా సెంటర్లపై సూపర్వైజర్లు ఇతర సిబ్బంది సెంటర్లను విజిట్ చేస్తూ ప్రతి చిన్న విషయాన్ని కూడా భూతద్దంలో పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సమాచారం.



అచ్చంపేటలోని ఐసిడిఎస్ ప్రధాన కార్యాలయం



ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మి

## అలాంటిదేమీ లేదు నా దృష్టికి రాలేదు...

అచ్చంపేట ఐసిడిఎస్ క్లస్టర్ పరిధిలో దాదాపు నాలుగు లక్షల రూపాయలు అంగన్వాడీ టీచర్ ఆయాలనుండి వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయాన్ని వెలుతురు దినపత్రిక గురువారం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ లక్ష్మి ని వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ గత మార్చి బడ్జెట్లో పోషన్ అభియాన్ ద్వారా ప్రతి టీచర్ కు 12 వేలు, ప్రతి ఆయాకు 3000 చొప్పున నిధులు విడుదల అయిన విషయం వాస్తవమని, వారి నుండి డబ్బులు వసూలు చేసిన విషయం తనకు తెలియదని, నా దృష్టికి రాలేదని, ఇందులో వాస్తవం లేదని ఈ విషయాన్ని సూపర్వైజర్లతో చర్చిస్తానన్నారు. ఇటీవల ఎగ్ బిర్యానీ అక్షరాభ్యాసం కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించిన సందర్భంగా అందుకు సంబంధించిన నిధులు లేకపోవడంతో ఖర్చులు నిమిత్తం ప్రతి టీచర్ నుండి కొన్ని డబ్బులు జమ చేసి కార్యక్రమం విజయవంతం చేసిన విషయం నిజమేనన్నారు.

# అవస్థలు పడుతున్నాం పి.హెచ్.సి లో డయాలసిస్ ఏర్పాటు చేయాలి.

- ఎంపీ ఎమ్మెల్యే కలెక్టర్ కృషి చేయాలి..

- బాధితుడు చంద్రమౌళి గౌడ్.



**నెల్లికుదురు, వెలుతురు జూన్ 22:**
డయాలసిస్ చికిత్స కోసం దూర ప్రయాణాలతో అవస్థలు పడుతున్నాం.. మండల కేంద్రం నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని డయాలసిస్ బాధితుడు,సీనియర్ జర్నలిస్ట్ పెరుమాండ్ల చంద్రమౌళి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఎంపీ బలరాం నాయక్,ఎమ్మెల్యే డా. మురళి నాయక్,జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కృషి చేయాలని ఆయన కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మండలంలో డయాలసిస్ పేషెంట్లు చాలామంది ఉన్నారని వారు జిల్లా కేంద్రాని కి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి రావడంతో ప్రయాణ బడలికతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీరియల్లో ఉండాల్సి రావడంతో బాధితులు భరించలేకపోతున్నారన్నారు.అధిక సంఖ్యలో పేదలు ఉండడంతో బస్సులలో వెళ్లి రావడం మరింత ఇబ్బందికరంగా ఉందన్నారు. దూర ప్రయాణ అలసట దీనికి తోడు ఇన్ఫెక్షన్ సమస్య లు అధికమవుతున్నాయన్నారు. డయాలసిస్ బాధితులపై దయ చూపి డయాలసిస్ సెంటర్ నెల్లికుదురు లో ఏర్పాటు చేయాలని చంద్రమౌళి కోరారు.

# సిపిఆర్ ట్రైనింగ్ అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్, దిల్ కీ బాత్ అని కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్





**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**
ఆదివారం రోజున దిగంబర్ జైన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ అధ్యక్షులు వినయ్ గంగ వాల్ వారి ఆధ్వర్యంలో సిపిఆర్ ట్రైనింగ్ అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్, దిల్ కీ బాత్ అని కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, యొక్క కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ డాక్టర్ కల జితేందర్ జిన్, హార్ట్ కి సంబంధించి ఎలా హార్ట్ ని ఆరోగ్యంగా ఉంచుకోవాలో వారు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ లీడర్ జి. రామన్ గౌడ్, పడాల శ్రీనివాస్ గౌడ్, జై కృష్ణ గౌడ్, కే శేఖర్, సుజాత, హితేష్, దిగంబర్ జెన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ సభ్యులు దినేష్ జెన్, సంగీత జెన్, ప్రవీణ్ పాండ్యా, పాల్గొనడం జరిగింది,



మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పంతంగి విఠలయ్య గౌడ్ నియామకం.

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 22:**

# హైదరాబాద్ ఆర్మీ కాలేజిలో ఆగంతుకుల కలకలం!

**హైదరాబాద్ వెలుతురు జూన్ 22:**
హైదరాబాద్‌లోని తిరుమలగిరి ఆర్మీ ఇంజనీరింగ్ కళాశాలలోకి నలుగురు వ్యక్తులు నకిలీ గుర్తింపు కార్డులతో అక్రమంగా ప్రవేశించడం కలకలం రేపింది. తాము ఎయిర్‌ఫోర్స్ అధికారులమని నమ్మబలికి, నకిలీ ఐడీ కార్డులు చూపించి లోనికి ప్రవేశించిన వీరిని ఆర్మీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

డీసీపీ వెల్లడించిన వివరాలు

తిరుమలగిరి ఆర్మీ కళాశాలలోకి నలుగురు వ్యక్తులు అక్రమంగా చొరబడిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. "నార్త్ జోన్ పరిధిలో అనేక మిలటరీ, ఆర్మీ ప్రాంతాలున్నాయి. ఇది దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కాబట్టి, మీడియా సంయమనం పాటించాలి" అని ఆమె కోరారు.

ఈ కేసులో ఎలాంటి ఉగ్రవాద కోణం లేదని ఆమె స్పష్టం చేశారు. "ప్రధాన నిందితుడు ఆశిష్ కుమార్, బీహార్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. ఇతను గతంలో క్యాంటీన్ నిర్వహించిన అనుభవం ఉంది. ఆర్మీ కళాశాల క్యాంటీన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, తనతో పాటు వచ్చిన మిగతా ముగ్గురిని ఆశిష్ మోసం చేశాడు. వారి దగ్గర నుంచి కమీషన్ కూడా తీసుకున్నాడు" అని డీసీపీ వివరించారు. ఆర్మీ కళాశాల ప్రాంగణంలో ఈ నలుగురు ఫోటోలు తీస్తుండగా ఆర్మీ సిబ్బంది గమనించి పట్టుకున్నారని తెలిపారు. ఆశిష్ కుమార్‌పై గతంలో బీహార్‌లో కూడా ఇలాగే ఓ మిలటరీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడిన కేసు నమోదైందని డీసీపీ రేష్మి వెల్లడించారు. "అన్ని కోణాల్లోనూ కేసును దర్యాప్తు చేస్తున్నాం. ఇలాంటి సున్నితమైన కేసుల దర్యాప్తులో మీడియా పోలీసులకు సహకరించాలి" అని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ ఘటనతో ఆర్మీ కళాశాల పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ ఐడీ కార్డులు, ఇతర ఆధారాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

# ఇరాన్ నుంచి ఢిల్లీ చేరుకున్న మరో 311 మంది భారతీయులు

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం
- ఇరాన్ లో పెద్ద సంఖ్యలో భారతీయులు
- వారిని తరలించేందుకు 'ఆపరేషన్ సింధు' చేపట్టిన కేంద్రం
- ఇప్పటివరకు 1,428 మంది తరలింపు




**ఢిల్లీ, వెలుతురు జూన్ 22:**
యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' ముమ్మరంగా కొనసాగుతోంది. అమెరికా బాంబర్ విమానాలు ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై దాడులు చేయడంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ క్లిష్ట పరిస్థితుల నడుమ, తాజాగా మరో 311 మంది భారతీయులు ఇరాన్‌లోని మష్హద్ నగరం నుంచి ప్రత్యేక విమానంలో దేశ రాజధాని ఢిల్లీకి సురక్షితంగా చేరుకున్నారు.ఈ తరలింపు వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆదివారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఆపరేషన్ సింధు కొనసాగుతోంది. జూన్ 22వ తేదీ సాయంత్రం 4:30 గంటలకు మష్హద్ నుంచి ప్రత్యేక విమానంలో 311 మంది భారతీయ పౌరులు న్యూఢిల్లీకి చేరుకున్నారు. దీంతో ఇరాన్ నుంచి ఇప్పటివరకు మొత్తం 1,428 మంది భారతీయులను సురక్షితంగా తరలించగలిగాం" అని ఆయన తన ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశమైన ఇరాన్ నుంచి తరలిస్తున్న వారిలో కశ్మీరీ విద్యార్థులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. సంఘర్షణల మయమైన ప్రాంతం నుంచి విద్యార్థులను సురక్షితంగా తీసుకువస్తున్నందుకు జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. "ఇరాన్‌లోని మష్హద్ నుంచి 200 మంది కశ్మీరీ విద్యార్థులతో సహా 280 మందికి పైగా భారతీయ విద్యార్థులతో మహాన్ ఎయిర్ విమానం (W50071A) ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ఆందోళనతో ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఇది గొప్ప ఉపశమనం కలిగించే క్షణం" అని జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం ఎక్స్ లో పేర్కొంది. "మా విద్యార్థులను మష్హద్ నుంచి సురక్షితంగా తరలించడంలో తక్షణమే స్పందించి, అవిశ్రాంతంగా సమన్వయం చేసి, మద్దతు అందించిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, ప్రభుత్వ అధికారులకు, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ కృషే మా విద్యార్థులను ఇంటికి చేర్చింది" అని ఆ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

## హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఇరాన్ పార్లమెంటు ఆమోదం...

# చమురు ధర భారీగా పెరిగే చాన్స్!

ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు

హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఇరాన్ పార్లమెంట్ ఓటు

తుది నిర్ణయం తీసుకోనున్న సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్, ఖమేనీ

"ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్" తో అణు స్థావరాలు ధ్వంసం అన్న ట్రంప్

జలసంధి మూతపడితే చమురు ధరలు ఆకాశానికి

**ఢిల్లీ, వెలుతురు జూన్ 22:**
ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా, ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధిని మూసివేయాలన్న ప్రతిపాదనకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆదివారం జరిగిన ఓటింగ్‌లో పార్లమెంట్ సభ్యులు ఈ నిర్ణయానికి మద్దతు పలికినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ విషయంలో తుది నిర్ణయం దేశ అత్యున్నత జాతీయ భద్రతా మండలి (సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్) మరియు దేశ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీలదేనని స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఓటింగ్ కేవలం ఒక సిఫారసు మాత్రమే. "హోర్ముజ్ జలసంధిని మూసివేయాలనే నిర్ధారణకు పార్లమెంట్ వచ్చింది. అయితే, దీనికి సంబంధించిన తుది నిర్ణయం సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చేతిలో ఉంది" అని పార్లమెంట్ జాతీయ భద్రతా కమిషన్ సభ్యుడు, రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇస్మాయిల్ కౌసరి ఆదివారం ప్రకటించినట్లు అల్ అరేబియా, జెరూసలేం పోస్ట్ పత్రికలు తెలిపాయి. పార్లమెంట్ ఆమోదంతో, హోర్ముజ్ జలసంధి మూసివేతకు సంబంధించిన తుది చర్యను అయతొల్లా ఖమేనీ ఆమోదించాల్సి ఉంటుంది. ఇది ఆదివారం నాడే జరిగే అవకాశం కూడా ఉంది. హోర్ముజ్ జలసంధి అనేది పర్షియన్ గల్ఫ్‌ను గల్ఫ్ ఆఫ్ ఒమన్ మరియు అరేబియా సముద్రంతో కలిపే ఒక ఇరుకైన జలమార్గం. దీని ఇరుకైన ప్రదేశంలో వెడల్పు సుమారు 21 మైళ్లు కాగా, ఇరువైపులా రెండు మైళ్ల వెడల్పుతో రెండు నౌకా రవాణా మార్గాలున్నాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండానే సాగుతుంది.

ఒకవేళ ఇరాన్ ఈ జలసంధిని మూసివేస్తే, తక్షణమే ముడి చమురు ధరలు 30 నుంచి 50 శాతం పెరిగే అవకాశం ఉందని, అదేవిధంగా గ్యాసోలిన్ ధరలు గ్యాలన్‌కు 5 డాలర్ల వరకు పెరగవచ్చని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడమంటే, నౌకల రాకపోకలను అసాధ్యంగా మార్చడమే. ఇరాన్ నౌకాదళం జలాల్లో మైన్‌లను అమర్చడం ద్వారా లేదా ట్యాంకర్లపై క్షిపణులతో దాడులు చేయడం ద్వారా ఈ మార్గాన్ని అడ్డగించవచ్చు. 1980లలో ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో, ఇరాన్ చమురు ట్యాంకర్లు మరియు చమురు లోడింగ్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది.



ఆ చర్యలు జలసంధిని పూర్తిగా అడ్డుకోనప్పటికీ, నౌకా రవాణా బీమా ప్రీమియంలు విపరీతంగా పెరగడానికి, సముద్ర ట్రాఫిక్ ఆలస్యం కావడానికి కారణమయ్యాయి. ఇరాన్ చాలాకాలంగా హోర్ముజ్ జలసంధిని మూసివేయగలమని, దీనిని ఉద్రిక్తతలు పెంచడానికి చివరి అస్త్రంగా పరిగణిస్తోందని చెబుతూ వస్తోంది.